
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 14 వ భాగం

### హాలాహలం – నీలకంఠుడు - 2

భగవంతుడెవడంటే అవతలవాళ్ళ ప్రాణాలకోసం తన ప్రాణాలనే పణం పెట్టగలవాడు. హాలాహలం వచ్చి మీద పడింది. శివుడి దగ్గిరకి దేవతలూ, రాక్షసులూ అందరూ పరుగెట్టారు. కానీ పక్కనే అమ్మవారు ఉంది వీళ్ళొచ్చినప్పుడు. ఆవిడని అడగకుండా ఏదేనా చేస్తే ఆవిడకి కోపం రాదూ? విషాన్ని తినేముందు శివుడు పార్వతితో చెప్తున్నాడు.

**క. ప్రాణేచ్ఛ వచ్చి చొచ్చిన**

**ప్రాణుల రక్షింపవలయుఁ బ్రభువుల కెల్లం**

**బ్రాణుల కిత్తురు సాధులు**

**బ్రాణంబులు నిమిష భంగురము లని మగువా!** [8-234]

ప్రాణరక్షణకి వచ్చినవాళ్ళని కాపాడటం ప్రభువుల ధర్మం. ఈ జీవితాలు నిముష భంగురాలని తెలిసి మిగతావాళ్ళ ప్రాణాలని ఎప్పుడూ కాపాడాలి.

**క.పరహితము జేయ నెవ్వఁడు**

**పరమ హితుం డగును భూత వంచకమునకుం**

**బరహితమె పరమ ధర్మము**

**పరహితునకు నెదురులేదు పర్వేందుముఖీ!** [8-235]

పరుల హితంకన్నా గొప్పదైన ధర్మం లేదు (అందువల్ల నా ప్రాణాలు అడ్డం పెట్టి నేను దీనిని భక్షించబోతున్నాను, ఏది ఏమైనా సరే)

**క. హరి మది నానందించిన**

**హరిణాక్షి జగంబులెల్ల నానందించున్**

**హరియును జగములు మెచ్చఁగ**

**గరళము వారించు టొప్పుఁ గమలదళాక్షీ! [8-236]**

దీనిలో ఇంకో విశేషం కూడా ఉంది. నేనిలా చేశానని తెలుస్తే శ్రీహరి సంతోషిస్తాడు. శ్రీహరి అంటే మొత్తం జగం అంతా కనుక జగమంతా ఆనందించినట్టు కూడా అవుతుంది. అందుచేత దీన్ని వారిస్తున్నాను ఇప్పుడు. ఇలా అనేసరికి పార్వతి చెప్పింది, 'స్వామీ, మీ మనసులో ఏది మంచిదని తోస్తే అలాగే చేయండి." "మృత్యుంజయాయ, సర్వేశ్వరాయ, సదాశివాయ, శ్రీమన్మహాదేవాయ నమః" అని కీర్తించబడే పరమేశ్వరుడెటువంటివాడో ఆవిడకి తెలియదా?

ఈ కథ శుకమహర్షి భాగవతంలో వచ్చేదిగా ఒక్కొక్క అవతారం పరీక్షిత్తుకి చెప్తున్నాడు కదా? ఇక్కడదాకా వచ్చేసరికి పరీక్షిత్తుకి ఒక సందేహం వచ్చింది. అదే అడుగుతున్నాడు మహర్షిని.

**మ. అమరన్ లోకహితార్థమంచు నభవుం డాఁ గాక యం చాడెఁ బో**

**యమరుల్ భీతిని మ్రింగవే యనిరి వో యంభోజగర్భాదులుం**

**దముఁ గావన్ హర! లెమ్ము లెమ్మనిరి వో తాఁ జూచి కన్గంట న**

**య్యుమ ప్రాణేశ్వరు నెట్లు మ్రింగుమనె న య్యుగ్రానల జ్వాలలన్. [8-239]**

"లోకహితార్థం కోసం శంకరుడు ఈ విషాన్ని తింటానన్నాడు సరే, దేవతలందరూ ఉబ్బు లింగడిని ఊదరగొట్టి తినమన్నారు సరే, బ్రహ్మాదులందరూ, "లే, లే, ఈ ఆపదలోంచి రక్షించు" అన్నారు సరే. ఇవన్నీ తన కంటిముందు జరుగుతూంటే ఆ ఉమాదేవి శివుడ్ని ఈ భీకరమైన హాలాహలాన్ని తినూ అని ఎలా అనగలిగింది?"

ఇక్కడ పోతన మొత్తం భాగవతాన్ని మనిషి స్థాయికి దించి పరమేశ్వరుడి గురించి మనం ఎంత మామూలుగా ఆలోచిస్తామో అనేది చూపిస్తున్నాడు. స్వామి వివేకానంద కూడా ఇలాగే చెప్పేవారుట. "మనిషి దేవుడ్ని చూడాలంటే మనిషి స్థాయిలో ఒక రూపం ఊహించుకోవాలి. రూపం మనలాగే కాళ్ళూ చేతులూ ఉన్నట్టు ఉంటే మనకి సులభం. భగవంతుడికి ముందు రూపం ఇలాగే ఆపాదించబడుతుంది. తర్వాత బ్రహ్మ జ్ఞానం కలిగాక ఆయనకో రూపం లేదనీ సర్వంతర్యామి అనీ గుర్తించగల్గుతాం."

**క. మ్రింగెడి వాఁడు విభుం డని**
**మ్రింగెడిది గరళ మనియు మేలని ప్రజకున్**
**మ్రింగు మనె సర్వమంగళ**
**మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో? [8-241]**

ఈ ప్రశ్నకి సమాధానం చెప్తున్నాడు శుకమహర్షి, "మింగేవాడు తన భర్త, మింగేది లోక కంటకమైన విషం. అది మింగితే ప్రజలందరికీ మేలు జరుగుతుంది. అందరికీ శుభాలు చేకూర్చే పార్వతి (సర్వమంగళ) అందుకే మింగమని చెప్పింది. ఆవిడ మంగళసూత్రాలని ఎంత నమ్మిందో కదా? పరీక్షిత్తు ఏ స్థాయిలో అడిగాడో అదే స్థాయిలో శుకుడు కూడా సమాధానం చెప్పేడు – మంగళసూత్రాన్ని నమ్మింది అంటూ – ఇది పోతన భాగవతంలో అలవోకగా సాగిపోయే హాస్యం. ముందు వచ్చే పద్యంలో పోతన రాసిన ఇంకా హాస్యమైన విషయాలు చూద్దాం.

**మ. తనచుట్టున్ సురసంఘముల్ జయజయధ్వానంబులన్ బొబ్బిడన్**
**ఘన గంభీర రవంబుతో శివుఁడు లోకద్రోహి! హుం! పోకు ర**
**మ్మని కెంగేలఁ దెమల్చి కూర్చి కడిగా నంకించి జంబూఫలం**
**బని సర్వంకషమున్ మహావిషము నాహారించె హేలాగతిన్. [8-242]**

అమ్మవారు ఒప్పుకుంది కదా? ఇంకేమి ఆలశ్యం? చుట్టూ ఉన్న దేవతలూ రాక్షసులూ జయ జయ అంటూంటే, శివుడు హాలాహలాన్ని, " లోకద్రోహి, ఎక్కడకీ పోవద్దు, ఇలా రా" అని దాన్ని చేతిలోకి తీసుకుని నేరేడు పండులాగా, దానితో ఆటాడుకుంటున్నట్టు (హేలాగతిన్) ఆరగించేడు.

విషం తింటే ఏమౌతుంది? కళ్ళు ఎర్రబడవచ్చు. ఒంటినిండా బొబ్బలు లేవొచ్చు. అనేక స్పందనలు వస్తాయి వంట్లోంచి ఆ విషం తీవ్రతని బట్టి. నరాలు, మెదడూ దెబ్బతింటాయి. ఒళ్ళు బిగుసుకు పోవచ్చు. చెమటలు పట్టేసి గుండె ఆగిపోవచ్చు. ఇవన్నీ విషం మూలానే కావొచ్చు లేకపోతే ఉత్తి షాక్ మూలంగా కావొచ్చు. పాము విషం వరకూ ఎందుకుగానీ ఈ తేదీ తర్వాత వాడొద్దూ అని రాసిన మందులవల్ల కూడా ఇలా జరగొచ్చు. మరి ప్రపంచంలో ఉన్న విషమంతా (హాలాహలం) తింటే? అది మనలాటి వాళ్లకి. మరి శివుడికో? ఈ పద్యంలో విషం ఆరగించడం వల్ల శివుడికొచ్చిన స్పందన చెప్తున్నాడు.

**మ. కదలం బాఱవు పాఁప పేరు; లొడలన్ ఘర్మాంబుజాలంబు పు**
**ట్టదు; నేత్రంబులు నెఱ్ఱ గావు; నిజజూటా చంద్రుఁడుం గందఁడున్;**
**వదనాంభోజము వాడ; దా విషము నాహ్వానించుచో డాయుచోఁ**
**బదిలుండై కడి జేయుచోఁ దిగుచుచో భక్షించుచో మ్రింగుచోన్. [8-244]**

మెడలో హారమైన పాములలో కదలికా, తేడా ఏమీ లేదు. కళ్ళు ఎర్రబడలేదు. ఒక్క చుక్క చెమట కారలేదు. జటాజూటంలో ఉన్న స్వచ్ఛమైన తెల్లని చంద్రుడు ఎర్రబడి కందలేదు. మొహం వాడినట్టూ లేదు ఈ విషం దగ్గిరకొచ్చినప్పుడూ, చేత్తో పట్టుకున్నప్పుడూ, ఆరగించినప్పుడూను.

మూల భాగవతంలో వ్యాసులవారు ఏమిరాసారో నాకు తెలియదు కానీ, ఇందులో పోతన చూపించిన హాస్యం అనితరసాధ్యం. మృత్యువుని జయించిన శివుడికి ఈ విషమో లెక్కా అని రాయచ్చు కదా? కానీ అలా రాయకుండా – ప్రపంచాన్ని కబళించే హాలాహలాన్ని (అంటే మన కష్టాలని) భగవంతుడు ఎంత సులభంగా నివారించగలడో అని చెప్పడానికి – ఇలాగే సరదాగా రాసేడు.

**క. ఉదరము లోకంబులకును**
**సదనం బగు టెఱిఁగి శివుఁడు చటుల విషాగ్నిం**
**గుదురుకొనఁ గంఠబిలమున**
**బదిలంబుగ నిలిపె సూక్ష్మఫలరసము క్రియన్. [8-245]**

భగవంతుడి ఉదరంలో అన్ని లోకాలూ ఉంటాయి. అందువల్ల ఆ విషాగ్ని లోపలకి వెళ్లి వీటిని దహించకుండా దాన్ని కంఠలోనే ఉంచుకున్నాడు. కానీ ఆ వేడికి కంఠం నీలంగా అయ్యి ఆయన నీలకంఠుడయ్యేడు. ఇలా మింగుతున్నప్పుడు అమ్మవారు శివుడి కంఠం మీద చేయి వేసి దాన్ని అక్కడ ఆపేరు అని ఇంకో కథ కూడా మనకి తెలిసినదే.

**క. మెచ్చిన మచ్చిక గలిగిన**
**నిచ్చిన నీవచ్చుఁ గాక యిచ్చ నొరులకుం**
**జిచ్చుఁ గడిగొనఁగ వచ్చునె**
**చిచ్చఱరూ పచ్చపడిన శివునకుఁ దక్కన్. [8-246]**

బాగా మెచ్చుకుంటే నచ్చేవన్నీ ఇవ్వొచ్చుగాక. కానీ ఇలా ఇష్టంగా అవతలివాళ్ళకి హానిచేసే విషాన్ని తినడం శివుడికి తప్ప ఇతరులకి సాధ్యమౌతుందా?

**ఆ. హరుఁడు గళమునందు హాలహలము బెట్టఁ**
**గప్పుఁ గలిగి తొడవు కరణి నొప్పె;**
**సాధురక్షణంబు సజ్జనులకు నెన్న**
**భూషణంబు గాదె భూవరేంద్ర!** [8-247]

ఇలా కంఠబిలంలో విషాన్ని పెట్టడం వల్ల నలుపు రంగు శివుడికి భూషణమైంది. సాధు రక్షణం అనేది సజ్జనులకి ఇలాగే అలంకారం కదా!

పోతన అలంకారాలు రాయడంలో, హాస్యం చూపించడంలో అలా ఎందులోనైనా సరే అక్షయ తూణీరుడు. కానీ ఇలా పద్యాలు రాసేవాళ్ళు చాలామంది ఉన్నప్పటికీ పోతన ఒక్కడే తెలుగు సాహిత్యంలో అలా నిలిచి ఉండగలగడనికి కారణం, మొదటి వ్యాసంలో చెప్పినట్టు భగవత్కృప కాక మరింకేమిటి?

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS